14న పాలక మండలి సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలక మండలి సమావేశం ఈ నెల 14న జరగనుంది. ఉద్యోగుల పదోన్నతులు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించనునట్లు సమాచారం.

15న కాన్షీరాం జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 15న బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత కాన్షీరాం జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తెలిపారు. శనివారం బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఓయూలో చంద్రారెడ్డి వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి ఏబీవీపీ దివంగత నేత మేరెడ్డి చంద్రారెడ్డి 26వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏబీవీపీ జాతీయ నాయకులు శ్రీకృష్ణ హాజరై చంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

3 నెలల్లో ఎంసీహెచ్ భవనం
6 నెలల్లో ఎస్ఓటీసీ..

'గాంధీ' అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం

- నిర్ణీత గడువులో పూర్తి చేయాలి
- సూపరింటెండెంట్ రాజారావు



నిర్మాణ పనులకు సంబంధించిన బ్లూ ప్రింట్లను పరిశీలిస్తున్న దృశ్యం



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూపరింటెండెంట్ రాజారావు ఆదేశించారు. తెలంగాణ వైద్యవిద్య మౌలిక కల్పన సదుపాయాల సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ఇంజినీర్లు, ఆస్పత్రి పాలనాయంత్రాంగం, సంబంధిత కాంట్రాక్టర్లతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన భవనం ఎనిమిదవ అంతస్తులో రూ. 35 కోట్ల వ్యయంతో చేపట్టిన స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ (ఎస్ఓటీసీ)ను ఆరునెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సెంటర్‌లో నాలుగు అత్యాధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేసి అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు. సుమారు రూ.50 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న తల్లీబిడ్డల సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) భవన నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని, జూన్ నెలాఖారులోగా అన్ని పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగిస్తామని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.

టెండర్లకు స్పందన కరువు!

ఎంసీహెచ్ భవనంలోనే ఫెర్టిలిటీ ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రూ. 2.75 కోట్లతో చేపట్టిన డైట్ క్యాంటిన్ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గాంధీలో అందించే నిరంతర వైద్యసేవలకు ఎటువంటి విఘాతం కలగకుండా దశలవారీగా నూతన విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, లీకేజీల నివారణకు పలుమార్లు టెండర్లు ఆహ్వానించినా ఎవరూ దరఖాస్తు చేయక పోవడంతో మారోమారు టెండర్లు పిలుస్తున్నామని సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బ్లూ ప్రింట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో ఆర్ఎంఓ-1 జయకృష్ణ, ఉస్మానియా గ్యాస్ట్రో ఎంట్రాలజీ సర్జరీ ప్రొఫెసర్ మధుసూదన్, టీఎస్ఎంఎస్ఐడీ ఈఈ శ్రీనివాసరావు, డీఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

లాలాపేట: సికింద్రాబాద్ సర్కిల్‌ను మోడల్ సర్కిల్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఆ దిశగా అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె తార్నాకలోని తన కార్యాలయంలో సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎస్ఎఫ్ఏ)తో సమీక్ష సమావేశం నిర్వహించారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. జనవాసాలు, విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాల్లో రోడ్లు, రహదారులు చెత్త ఉండరాదన్నారు. కార్మికుల హాజరు బయోమెట్రిక్‌తో ఉండాలన్నారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లగా మంత్రి దృష్టికి తీసుకెళ్తాన్నారు. ఈ సమావేశంలో మోతే శోభన్‌రెడ్డి, పలువురు ఎస్ఎఫ్ఏలు యాకయ్య, దశరథ్ పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

నూతన కమిటీకి అభినందన..

లాలాపేట: సికింద్రాబాద్ సర్కిల్–29 శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎస్ఎఫ్ఏ) నూతన కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. శనివారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కమిటీ బృందం మర్యాదపూర్వకంగా కలువగా వారి ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో గబ్బర్, సురేష్‌కుమార్, యాదగిరి, రమేష్, ఎస్. యాదగిరి, నగేష్ ఆనంద్‌కుమార్, పోచాలు పాల్గొన్నారు.

లాల్‌బజార్‌లో ఎన్నికల ప్రచారం

రసూల్‌పురా: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో పేదల కోసం అమలవుతున్న పలు పథకాలు కంటోన్మెంట్ బోర్డు పరిధిలోనూ ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేసినట్లు ఉద్యమకారుడు రంగా రవీందర్ గుప్తా పేర్కొన్నారు. కంటోన్మెంట్ బోర్డు ఏడవ వార్డు తిరుమలగిరి లాల్‌బజార్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఏడవ వార్డు పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో దివంగత ఎమ్మెల్యే సాయన్న సహకారంతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. సంగీతా యాదవ్, ప్రవీణ్‌యాదవ్, మేరి, గోపి, చందు పాల్గొన్నారు.



విద్యుత్ ఉద్యోగుల నిరసన



రసూల్‌పురా: టీఎస్‌పీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమని నాయకులు వేణు, ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతన సవరణ నిరసన కార్యక్రమంలో భాగంగా కంటోన్మెంట్ డివిజన్ మడ్‌ఫోర్ట్ విద్యుత్ కార్యాలయం వద్ద సికింద్రాబాద్ సర్కిల్ ఉద్యోగులు వందలాది మంది భోజన విరామ సమయంలో శుక్రవారం నిరసన తెలిపారు. పలు దఫాలుగా చర్చలకు పిలుస్తామని చెప్పి కల్లబొల్లి మాటలు చెప్పి సంవత్సర కాలం గడిపారని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం, ప్రభుత్వం కలిసి వెంటనే పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అరుణ్, మురళి, నరేందర్, శ్రీనివాస్, సతీష్ బాబు, మనోహర్ పాల్గొన్నారు.

'పికెట్' వంతెనతో ముంపు సమస్యకు చెక్

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: పికెట్ నాలాపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేసి ఏప్రిల్ వరకు పూర్తి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వంతెన నిర్మాణ పనులను శనివారం ఆయన పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సిబ్బందిని పెంచి పనులు వేగంగా చేయించాలని చెప్పారు. ప్రతి వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే నీరు సాఫీగా వెళ్లకపోవడంతో పరిసర ప్రాంతాల్లోని పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయన్నారు. వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని సంకల్పంతో మంత్రి కేటీఆర్ చొరవతో నాలాపై ఈ వంతెన పనులను చేపట్టినట్లు వివరించారు. అలాగే కరాచీబేకరీ వద్ద కూడా పికెట్ నాలాపై కూడా రూ.10 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. గతంలో ఉన్న వంతెన కన్నా ఎత్తు, వెడల్పు పెంచి నిర్మాణం చేపట్టడంతో పై నుంచి ఎంత వరద వచ్చినా సాఫీగా ముందుకు వెళ్లిపోతుందన్నారు. ఈ వంతెనల నిర్మాణాలతో అన్నానగర్, రసూల్‌పూరా, ఇక్రిశాట్‌కాలనీ, బీహెచ్ఈఎల్ కాలనీ, సింధీకాలనీ తదితర ప్రాంతాలకు వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు. బేగంపేట నాలా పనులు కూడా ముమ్మురంగా సాగుతున్నాయని నాలా వెంట ఉన్న కాలనీలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, ఎస్ఎన్‌డీపీ సీఈ కిషన్, జలమండలి డైరెక్టర్ కృష్ణ, జడ్సీ శ్రీనివాసరెడ్డి, జలమండలి జీఎం రమణారెడ్డి, డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్ ఉన్నారు.



వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి తలసాని

ఓ చెవి తెగి నేలపై..
మరో చెవి సగం తెగి వేలాడుతూ..

గాయపడిన గుర్తుతెలియని వ్యక్తిని గాంధీకి తరలింపు



రాంగోపాల్‌పేట్: ఓ వ్యక్తి రెండు చెవులు తెగిపోయి వేలాడుతూ కనిపించడం కలకలం రేగిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం సాయంత్రం 40 ఏళ్ల వయసుండే వ్యక్తి ఒక చెవు పూర్తిగా తెగి కిందపడిపోగా మరో చెవి వేలాడుతూ రక్తస్రావంతో కనిపించారు. పోలీసులు బాధితుడి వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించినా అతడు ఏ మాత్రం సహకరించలేదు. చికిత్స నిమిత్తం అతన్ని గాంధీకి తరలించారు. బాధితుడు తిరిగిన పరిసరాల్లో సీసీ కెమెరాలను పరిశీలించినా ఎలా జరిగిందనేది తెలియలేదు. బాధితుడు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని చికిత్సకు సైతం సహకరించడం లేదని ఎస్సై మమత తెలిపారు.

సిలిండర్‌కు దండేసి.. వినూత్న నిరసన తెలిపి..

బన్సీలాల్‌పేట్: కేంద్రం వంట గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు శనివారం బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద గ్యాస్ సిలిండర్‌కు పూలదండ వేసి వినూత్న నిరసనతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షులు నాగేందర్ రాజ్ (రాజప్ప), నాయకులు ఎస్. విఠల్, డాక్టర్ శివకుమార్ లాల్, లక్ష్మణ్‌రావు, రమేష్, వేద ప్రకాశ్, డి.మల్లికార్జున్, చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు.వంట గ్యాస్ ధరల పెంపు పేద, మధ్య తరగతి వర్గాలకు గుదిబండగా మారిందన్నారు. కేంద్రం ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. పెంచిన గ్యాస్ సిలిండర్ వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.



బన్సీలాల్‌పేట్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

ముగిసిన రక్షణ సువార్త సభలు

లాలాపేట: సర్వలోకానికి దేవుడు ఒక్కడే ఆయనే యేసుక్రీస్తు అని రెవరెండ్ ఆచార్య ఆహరోన్ తీగుళ్ల అన్నారు. బెత్లెహేమ్ ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చి 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శాంతినగర్‌లో గత మూడు రోజుల నుంచి ఏర్పాటు చేసిన రక్షణ సువార్త స్వస్థత మహాసభలు శనివారం ముగిశాయి. చర్చి క్వయర్ బృందం ఆలపించిన క్రైస్తవ గీతాలతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జీసస్ హెల్ప్స్ మిని స్ట్రీస్ ఫౌండర్ డైరెక్టర్ బ్రదర్ ఆదాంబెన్ని, గాస్పల్ సింగర్ బ్రదర్ జడ రమేష్ పాల్ సందేశాన్ని ప్రకటించారు.

కుమార్తెతో సహా తల్లి అదృశ్యం

చిలకలగూడ: కుటుంబ కలహాలతో కుమార్తెతో కలిసి తలి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్ వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన అక్షయ్‌కుమార్, దామినీ (26) భార్యాభర్తలు. నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న వీరికి మూడేళ్ల పాప అషిక ఉంది. పాప పుట్టినరోజు విషయమై గతనెల 28న మధ్య గొడవ జరగగా అదే విషయమై గత రెండు రోజులుగా గొడవ పడుతున్నారు. ఈ నెల 2న చిన్నారి అషికను బయటకు వెళ్లిన దామిని ఎంతకీ ఇంటికి రాలేదు. సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో అక్షయ్‌కుమార్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో కార్పెంటర్..

చిలకలగూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ గోరక్‌పూర్‌కు చెందిన నగీనా సహానీ అలియాస్ రాము (32) కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వచ్చి సీతాఫల్‌మండి మేడిబావిలో ఉంటున్నారు. కార్పెంటర్ పనిచేసే సహానీ ఈ నెల 2న ఖాజీపేట వెళ్తున్నానని వెళ్లి ఎంతకీ రాలేదు. భార్య దేవంతి సహానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో శిశువిహార్‌లో చిన్నారి మృతి

అమీర్‌పేట: శిశు విహార్‌లో ఆశ్రయం పొందుతున్న ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టుకతోనే అనారోగ్యంతో బాధపడుతున్న బి.శివాని (12) మంచానికే పరిమితమై మాట్లాడడం కూడా రాదు. తల్లిదండ్రులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు.ఆర్థిక పరిస్థితుల కారణంగా యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో చేర్పించారు. ఎనిమిదేళ్లుగా ఆశ్రయం పొందుతున్న శివానికి శుక్రవారం తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో వీఆర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

లష్కర్‌లో ప్రభుత్వ పెట్రోల్ బంకు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ప్రధాన రహదారిలో పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో నూతన పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నారు. 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు సంబంధించిన పనులు చురుకుగా సాగుతున్నాయి. పౌర సరఫరాల శాఖ, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆధునిక హంగులతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. సికింద్రాబాద్ బైబిల్ హౌస్ నుంచి బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్, శ్మశానవాటిక నుంచి సోమప్పమఠం బస్తీకి వెళ్లే రహదారి పక్కనే సువిశాలమైన ప్రదేశంతో పెట్రోల్ బంకు తీర్చిదిద్దారు. పాత సచివాలయం ప్రాంగణంలోని పెట్రోల్ బంకును నూతన సచివాలయం నిర్మాణంలో భాగంగా తీసివేశారు. అదే పెట్రోల్ బంకును దేవాదాయ శాఖకు సంబంధించిన జీరా స్థలంలో నిర్మిస్తున్నారు. పనులు చివరి దశకు చేరుకున్నాయని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

'దక్కన్' అగ్ని ప్రమాదంలో మృతుడు జునైద్‌గా గుర్తింపు

డీఎన్ఏ పరీక్షలో వెల్లడి

రాంగోపాల్‌పేట్: మినిస్టర్ రోడ్‌లోని దక్కన్ మాల్ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో లభించిన మృతుడి అవశేషాలతో అవి జునైద్‌విగా గుర్తించారు. జనవరి 19న దక్కన్ భవనంలో అగ్ని ప్రమాదం జరిగి ముగ్గురు వ్యక్తులు గల్లంతైన విషయం విదితమే. గుజరాత్‌కు చెందిన జునైద్, వసీం, జహీర్ దక్కన్ భవనంలోని దక్కన్ నిట్‌వేర్‌లో పనిచేస్తూ ప్రమాదం జరిగిన సమయంలో యజమాని సూచన మేరకు సామగ్రి బయటకు తెచ్చేందుకు వెళ్లి మంటల్లో చిక్కుకుపోయారు. పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది, క్లూస్ టీం భవనం మొత్తం గాలించగా పూర్తిగా కాలిపోయిన మనిషి ఎముకలు, తొడ భాగంలోని కొంత మాంసం మాత్రమే లభించింది. వీటిని సేకరించి డీఎన్ఏ పరీక్షల కోసం ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. ఆ తర్వాత గల్లంతైన ముగ్గురి దగ్గరి రక్త సంబంధీకుల రక్త నమూనాలు సేకరించారు. అక్కడ జరిపిన డీఎన్ఏ పరీక్షల్లో జునైద్ బంధువుల రక్త నమూనాలతో దొరికిన ఎముకల అవశేషాలు మ్యాచ్ కావడంతో అవి జునైద్ మృతదేహానికి సంబంధించినగా గుర్తించారు. మరో ఇద్దరికి సంబంధించిన ఎలాంటి శరీర ఆనవాళ్లు లభించలేదు. మంటలు చెలరేగిన సమయంలో ఏ ప్రదేశంలో ఉండే అవకాశాలుండవచ్చని ప్రత్యక్ష సాక్షుల ద్వారా భవనంలోని 50 ప్రదేశాల్లో శిథిలాల నుంచి శాంపిల్స్‌ను పోలీసులు సేకరించారు. ఇందులో ఏమైనా మానవ అవశేషాలు ఉన్నాయేమో గుర్తించాలని సేకరించిన వాటిని కూడా ఎఫ్ఎస్ఎల్‌కు పంపించినట్లు రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ తెలిపారు.

సత్ఫలితాలిస్తున్న మహిళ సహాయక కేంద్రం

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహిళ సహాయక కేంద్రం సత్ఫలితాలిస్తోంది. వివిధ కారణాలతో ఠాణాకు వచ్చే బాధిత మహిళలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేందుకు పోలీస్‌శాఖ అన్ని ఠాణాల్లోనూ ఉమెన్స్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ఎస్ఐ స్థాయి అధికారిణికి బాధ్యతలు అప్పగించింది. చిలకలగూడ ఠాణాలో ఏర్పాటు చేసిన ఉమెన్స్ హెల్ప్‌డెస్క్‌లో బాధిత మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మహిళ ఎస్ఐ సబిత, కానిస్టేబుళ్లు అన్నపూర్ణ, స్వరూప వద్ద నిర్భయంగా వెల్లడించడంతో కేసుల పరిష్కారం సులభమవుతోంది. కేసు స్వరూపం, స్వభావం పరిశీలించి బాధిత మహిళలకు కౌన్సెలింగ్, భరోసా, ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లకు రిఫర్ చేస్తున్నామని, ప్రతినెల 50 నుంచి 70 కేసులు నమోదు కాగా, పెద్దసంఖ్యలో కేసులు పరిష్కారం అవుతున్నాయని ఎస్ఐ సబిత తెలిపారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

రాంగోపాల్‌పేట్: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఓల్డ్ అల్వాల్‌కు చెందిన మహేష్ (22) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. తన స్నేహితురాలితో కలిసి శనివారం తార్నాకా నుంచి సికింద్రాబాద్‌కు యాక్టివాపై వెళ్తుండగా జనగాం నుంచి జగద్గిరిగుట్టకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అలుగడ్డబావి చౌరస్తా వద్ద ఢీకొట్టింది. కిందపడిపోయిన మహేష్, స్నేహితురాలు అశ్విత తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



కొత్త ఓటరు దరఖాస్తులు..16 వేలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో నూతన ఓటర్ల నమోదుకు భారీ స్పందన లభించింది. ఎనిమిది వార్డుల నుంచి 16 వేలకు దరఖాస్తులు అందాయి. మూడ్రోజుల పాటు సాగిన నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఎన్నికల ప్రకటన నాటికి బోర్డు ఓటరు జాబితాలో 1,32,722 మంది ఓటర్లు ఉండగా, నూతనంగా ఓటు హక్కు కోసం 16 వేలకు పైగా దరఖాస్తులు రావడం గమనార్హం. ఆయా దరఖాస్తులపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 18వ వరకు దశల వారీగా పరిష్కరిస్తారు. ఈ నెల 23న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు.

ఆఖరి గంటలో తొమ్మిది వేలు..

ఓటరు నమోదుకు మూడు రోజుల పాటు అవకాశం కల్పించినప్పటికీ, చివరి రోజైన శనివారం సాయంత్రం 4.00 గంటల వరకు ఊడు వేల దరఖాస్తు రాగా సాయంత్రానికి ఏకంగా 16 వేలను దాటడం గమనార్హం. వివిధ వార్డుల నుంచి పోటీ చేయబోయే అభ్యర్థులు తమ ప్రతినిధుల ద్వారా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పంపారు. ఒకటో వార్డు నుంచి 3001 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న కారణంతో రెండో వార్డులో 25 వేలకు పైగా ఓట్లు తొలగించారు. అయితే ఈ వార్డు నుంచి నూతన ఓటరు నమోదుకు కేవలం 2,581 దరఖాస్తులే వచ్చాయి. మూడోవార్డు 1,476, నాలుగో వార్డు 1,380, ఐదోవార్డు 2,480, ఆరోవార్డు 2,510, ఏడోవార్డు 1,100, ఎనిమిదో వార్డు నుంచి 1,500కు పైగా దరఖాస్తులు వచ్చాయి.



శస్త్ర చికిత్స అవసరం లేని వినికిడి పరికరం అందుబాటులోకి..

సాక్షి, సిటీబ్యూరో: శస్త్రచికిత్స అవసరం లేని వినికిడి ఉపకరణం అందుబాటులోకి వచ్చింది. గుజరాత్ ప్రభుత్వం శ్రీమ్ ఇన్నోవేషన్ల సహకారంతో స్టార్టప్ కంపెనీ వుయ్‌హియర్ 100 శాతం వినికిడి లోపం ఉన్న వారి కోసం ఈ నాన్-సర్జికల్ వినికిడి ఉపకరణం అందుబాటులోకి తెచ్చినట్లు రూపకర్తలు తెలిపారు. సికింద్రాబాద్‌లోని హెలెన్ కెల్లర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ రిహాబిలిటేషన్ ఫర్ ది డిసేబుల్డ్ చిల్డ్రన్ (హెచ్‌కెఐఆర్ఆర్‌డీసీ)లో ఈ పరికరాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లయన్. పి. ఉమర్ ఖాన్ మాట్లాడుతూ.. వినికిడి లోపం ఉన్నవారు కూడా అందరిలాగే సాధారణ జీవితాన్ని గడపడానికి ఇది సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమ్ ఇన్నోవేషన్స్, డైరెక్టర్, ఆదేశ్ అగర్వాల్, తెలంగాణ ఆడియాలజిస్ట్స్ అండ్ స్పీచ్-లాంగ్వేజ్ పాథాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, డాక్టర్ నాగేందర్ కంకిపాటి పాల్గొని మాట్లాడారు.